# రాత్రికి రాత్రే

కాలు మీద కాలేసుకుని
కాగితాలు నడుపుతే చాలు
రాత్రికి రాత్రే
కాసులు
గుణకారాలు గుణకారాలై గలగల లాడేవి
అప్పుడు వాడొక ప్రముఖ ముఖ చిత్రం
మహా మేధావి
ఒక మేరు పర్వతం
లొసుగులు కనబడని వ్యవస్థకది విజయకేతనం

ఎగబడిన కాసుల కలలన్నీ
నిశ్చింతగా నిద్రపోతున్న బతుకు రహదార్లమీద
ఆ కొండ చరియ విరిగిపడ్డప్పుడు
రాత్రికి రాత్రే
ఎన్నెన్ని ఆశలు నేల మట్టమయ్యాయో!
మెలకువగా ఉన్న మూటలు
ఏఏ దారుల్లో ఎలా కనుమరుగయ్యాయో!
ఏ శోధనలకీ అందవు

వెలికి తీసిన శవాలు
ఎన్నెన్ని కథలు చెబుతాయో!
కోల్పోయిన ఆస్తులు
ఇంకే కొండల్ని ఆశ్రయిస్తాయో!
మూసుకు పోయిన రహదార్లు
మళ్లీ ఎప్పుడు తెరుచుకుంటాయో!
రాత్రికి రాత్రే తెలియదు

తరిగిపోయి విరిగిపోయిన
కొండలా వాడిప్పుడు –
నిబ్బరంగానే నిల్చుని
నిర్దోషిత్వాన్ని నిరూపించుకోజూస్తున్న సంచలనం
బతుకు పోరాటంలో
శోధన నాళికలో మరుగుతున్న రసాయనం
ఏదో రాత్రికి రాత్రే
ఎవరి మొహం వికృతమవుతుందో?